దేశం కోసం ఓటు వేద్దాం..

- ఆకట్టుకున్న ఓట్ ఫర్ చిత్తూరు' ప్రదర్శన

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఊరు కోసం.. రాష్ట్రం కోసం.. దేశం కోసం.. ఓటు వేస్తామని యువత ప్రతినభూనారు. "ఓట్ ఫర్ చిత్తూరు" అంటూ నగరంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లోని యువ ఓటర్లు చేసిన అక్షర ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.షన్మోహన్, ఆర్వో, జేసీ శ్రీనివాసులు, ఏఈఆర్వో, కమిషనర్ అరుణ ఆదేశాలతో అధికారులు శుక్రవారం యువ ఓటర్లకు ప్రత్యేక ఆకర్షనీయంగా ప్రదర్శన చేపట్టారు.

విజిలేయండి.. వచ్చేస్తారు..!

- 'సి విజిల్' యాప్‌తో ఉల్లంఘనలకు కళ్లెం
- ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లో సంఘటనా స్థలానికి..
- బాధ్యతగా వినియోగించుకోవాలంటున్న అధికారులు
- ప్రతి కంప్లైయింట్‌కి స్పష్టమైన పరిష్కారం

సివిజిల్ యాప్ లోగో

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. అక్రమాలు, ఎన్నికల నిబంధనలు ఉల్లఘించిన వారిపై చర్యలకు అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతున్నారు. విధుల్లో ఉంటూ నిబంధనలు అతిక్రమించిన వారిపై ఇప్పటికే చర్యలు చేపడుతూ కోడ్ అమలు చేస్తున్నారు. ఎన్నికల నియమావళిని అమలు చేసేందుకు పౌరుల భాగస్వామ్యం కోరుతూ అందుబాటులోకి 'సి విజిల్' యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రతి ఒక్కరూ ఫిర్యాదు చేసే అవకాశాన్ని కల్పించారు.

అదేలా అంటే..

ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా అందులో పొందుపరచవచ్చు. ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డ్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన 5 నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి 100 నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై కచ్చితమైన చర్యలు తీసుకుంటారు. దీన్ని పౌరులు ఎవరైనా వినియోగించవచ్చు. పార్టీలకు అతీతంగా ఎవరు అవినీతికి పాల్పడినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

ఇలా రిజిస్టర్ చేసుకోవాలి..

ముందుగా గూగుల్ ప్లే స్టోర్‌లో కేంద్ర ఎన్నికల సంఘం వారి 'సి విజిల్' యాప్

డౌన్‌లోడ్ చేసుకోవాలి. మీ మొబైల్ నంబరు ద్వారా దానిలో రిజిస్టర్ చేసుకోవాలి. ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేస్తే సి విజిల్' యాప్ సిద్ధమైనట్లే. దాని ద్వారా మీరు ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

ఎలాంటి ఫిర్యాదులు చేయొచ్చంటే..

ఎన్నికల ప్రవర్తనా నియమావళికి భిన్నంగా ఉన్న దేనిపైనైనా ఫిర్యాదు చేయవచ్చు. డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం. ఇలాంటి ఉల్లంఘనలను ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రికార్డ్ చేసి అప్‌లోడ్ చేయాలి. మీ యాప్ తెరవగానే తెరపై 'ఫొటో', 'వీడియో', 'ఆడియో' అనే మూడు ఆప్షన్లు ఉంటాయి. మీరు ఫొటో ద్వారా ఫిర్యాదు చేయాలనుకుంటే ఫోటో ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. మీ లొకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించిన ఫొటోను అప్‌లోడ్ చేయండి. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం తదితర వివరాలను నమోదు చేయాలి. సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి. ఇది ఎన్నికల సంఘానికి చేరుతుంది.

ఐదు నిమిషాల్లో అప్రమత్తం..

యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి 5నిమిషాల్లో.. దానిని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారు. విచారించి, 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు. ఆయన దానిపై 50నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు.

ఇలా 100నిమిషాల్లో 'సి విజిల్' యాప్‌లో చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారు. మీరు చేసిన ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది.

తాయిలాలు, అక్రమాలకు చరమగీతం

తాయిలాలు పంచి, అక్రమాలకు పాల్పడి అధికార పీఠం ఎక్కాలనుకునే అరాచక రాజకీయ పార్టీలకు ఈ యాప్ ద్వారా చరమ గీతం పాడొచ్చు. ఈ రోజే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని.. ఎక్కడైనా ఎన్నికల ఉల్లంఘన కనిపిస్తే ఫిర్యాదు చేయండి. అక్రమాలకు అడ్డుకట్ట వేయండి. మీ పిల్లలు, రాష్ట్ర బంగారు భవిష్యత్తు కోసం.. మీ వంతు బాధ్యతను నిర్వర్తించండి.

1 నుంచి పదో తరగతి మూల్యాంకనం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకు స్థానిక పిసిఆర్ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి పరీక్షా పత్రాల మూల్యాకనం చేపట్టనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏవ్వరికీ ఎలాంటి మినహాయింపు ఉండదని ఈనెల 31వ తేది మధ్యాహ్నం మూడు గంటల లోపు డిప్యూటీ క్యాంపు ఆఫీసర్ పిసిఆర్ ఉన్నత పాఠశాల నందు రిపోర్టు చేయాలని కోరారు.

'భర్తను కోల్పోయిన కార్మికురాలికి ఆర్థికసాయం అందించాలి'

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: భర్తను కోల్పోయిన మున్సిపల్ పారిశుధ్య కార్మికురాలికి ఆర్థిక సాయం అందించాలని ఏపి మున్సిపల్ వర్కర్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ నాయకులు గణపతి, నాగరాజు, లోకనాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికురాలు గంగమ్మ భర్త కొండయ్య శుక్రవారం మృతి చెందారు. స్థానిక మున్సిపల్ వర్కర్స్ కాలనీలో కొండయ్య మృతదేహానికి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల కుటుంబాలను ఆదుకోవడానికి నిరంతరం ముందుంటుందని తెలిపారు. ప్రభుత్వం కూడా వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

హోం ఓటింగ్ సక్సెస్ అయ్యేనా..!



ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల కమిషన్ చెబుతోంది. ఇందు కోసం పోలింగ్ బూత్ వరకు వెళ్లి ఓటు వేయలేని వారి కోసం కొన్ని ప్రత్యేక సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. ఈ మేరకు గత ఎన్నికల్లో హోం ఓటింగ్‌ను తీసుకొచ్చారు. నడవ లేని స్థితిలో ఉన్న వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు. ప్రత్యేక ప్రతిభావంతులు ఇంటి నుండే తమ ఓటు హక్కును వినియోగించుకోవడం హోం ఓటింగ్ యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ విధానాన్ని పెద్దగా జిల్లాలో అమలు చేయకపోయారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ఖచ్చితంగా హౌం ఓటింగ్‌కు ఎంత మంది అర్హుల్లో గుర్తించి మందుగా ఎన్నికల కమిషన్‌కు పంపాల్సి ఉంటుంది. ఇందు కోసం 85 సంవత్సరాలు దాటిన ఓటర్లతో పాటు పోలింగ్ బూత్ వరకు వెళ్ళి ఓటు హక్కు వినియోగించుకోలేని ఓటర్లను గుర్తించి ఫాం 12 డిని నింపి అనుమతి తీసుకోవాలి.

జిల్లాలో 85 ఏళ్లు పైబడిన వారు 25 వేల మంది

చిత్తూరు జిల్లాలోని ఏడు నియోజక వర్గాల పరిధిలో 15,56,247 మంది ఓటర్లున్నారు. వీరిలో 85 సంవత్సరాలు పైబడిన వారు 25 వేల మంది ఉన్నారు. విభిన్న ప్రతిభావంతులు 4 నుంచి 5 ఓటర్లుగా ఉన్నారు. వీరిలో పోలింగ్ స్టేషన్ వరకు వెళ్ళి ఓటు వేయలేని వారిని పోలింగ్ బూతుల వారిగా ప్రభుత్వ అధికార్లు గుర్తించాల్సి ఉంది. ఈ ప్రక్రియ ప్రభుత్వం యాత్రంగం ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా ఇలా గుర్తించిన వారికి హోం ఓటింగ్ పద్ధతి ద్వారా ఫాం 12డి ద్వారా ఓటు హక్కును కల్పించనున్నారు.

హోం ఓటింగ్‌పై పలు అనుమానాలు

హౌం ఓటింగ్ అంటే ఇంటివద్దే ఓటు వేసి విధానం ఎలాగైతే పోలింగ్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పోస్టల్ బ్యాల్ ద్వారా ఓటు హక్కును కల్పిస్తారో ఆదే విధంగా హౌం ఓటింగ్ పద్ధతిలో పోలింగ్ బూత్ వరకు వెళ్లలేని వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. ఇలా ఓటరు వద్దకు పోలింగ్ సిబ్బంది వెళ్ళేతే పోటీలో ఉన్న అభ్యర్థిలు పోస్టల్ బ్యాలెట్‌లో తమకే ఓటు వేసేలా ఓటరు ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఓటు వేసే గోప్యత ఉండదని రాజకీయ పార్టీలు హౌం ఓటింగ్ విధానంపై అభ్యతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానంపై ఎన్నికల కమిషన్ మార్పు చేయాలని కోరుతున్నారు.

స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేయండి: ఎస్పీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే ప్రధాన లక్ష్యమని చిత్తూరు ఎస్పీ జాషువా తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కోసం ప్రజలకు మేమున్నాము అనే భరోసా ఇచ్చేందుకు, ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలుపుతూ పోలీసులు కవాతు నిర్వహిస్తున్నారని తెలిపారు. కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లా పోలీసులు ప్రజలలో భరోసా కల్పించేందుకు, ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతిభద్రతలను కాపాడడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లాకు 3 కంపెనీల ఎస్-ఎస్‌బి బలగాలు ఒక సిఆర్‌పిఎఫ్ బలగం కేటాయించారని, సిఆర్ పిఎఫ్ కంపెనీని కుప్పం సబ్ డివిజన్‌కు, ఒక ఎస్ఎస్‌బి బలగం నగరి సబ్ డివిజన్‌కు మరో 2 ఎస్ఎస్‌బి బలగాలను చిత్తూరు, పలమనేరు సబ్ డివిజన్‌కు అటాచ్ చేయడం జరిగిందన్నారు. శుక్రవారం చిత్తూరు జిల్లాలోని ప్రధాన ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు చెప్పారు. నిర్భయంగా ప్రజలందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

జిల్లా ఎస్పీ జాషువా

నాన్ లోకల్ అభ్యర్థికి సీటిస్తారా..

- టిడిపి చిత్తూరు పార్లమెంట్ ఎస్సీసెల్ అధ్యక్షులు పీటర్

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: పార్టీ కోసం 35 సంవత్సరాలు నిస్వార్థంగా సేవ చేస్తే లోకల్ వ్యక్తిని కాదని నాన్‌లోకల్ వ్యక్తికి పార్లమెంట్ సీటు ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో పార్టీ కోసం నిస్వార్థంగా పని చేసిన వ్యక్తిని గెలిపిస్తారా నాన్‌లోకల్ వ్యక్తిని గెలిపిస్తారా అనే విషయం ఓటర్లు తెలుస్తారని టిడిపి ఎస్సీసెల్ పార్లమెంటరీ అధ్యక్షులు ఫీటర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రియాశీలక సభ్యత్వం లేని వారికి స్థానికేతరులకే ఎస్సీ నియోజకవర్గాలలో పోటి చెయ్యడానికి అభ్యర్థులకు అవకాశం ఇవ్వడంలో ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ధన బలం ఉన్న వ్యక్తి బాపట్లలో పోటీ చేయాలని ఎక్కడి నుండో వచ్చి కించపరిచేలా మాట్లాడం సరికాదన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-పలమనేరు: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహమ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 27న ప్రవేశ పరీక్ష జరగనుండగా అందుకోసం 1వ తేదీ నుంచి 24వరకు శిక్షణ ఇవ్వడం జరగుతుందని పేర్కొన్నారు. ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం కోసం 10వ తరగతి హాల్ టికెట్, ఆధార్‌కార్డు, ఫొటో, మొబైల్ ఫోన్ తెచ్చుకొని కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

శ్రీసిటీ మోండెలెజ్ పరిశ్రమ అంబులెన్స్ వితరణ

ప్రజాశక్తి - వరదయ్యపాలెం శ్రీసిటీలో క్యాడ్‌బరీ డైరీ మిల్క్, ఓరియో, బోర్న్‌విటా వంటి దిగ్గజ బ్రాండ్‌ల తయారీ పరిశ్రమ మోండెలెజ్ ఇండియా, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) లో భాగంగా శుక్రవారం సూళ్లూరుపేట కమ్యూనిటీ ప్రభుత్వ ఆసుపత్రికి రూ.30 లక్షల విలువైన అధునాతన వసతులు కలిగిన నూతన అంబులెన్స్‌ను వితరణగా ఇచ్చింది. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయం వద్ద (ర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో డియంహెచ్ఓ డాక్టర్ శ్రీహరికి మోండెలెజ్ ప్లాంట్ డైరెక్టర్ అమిత్ జైన్ అధికారికంగా అంబులెన్స్ తాళాలను అందజేశారు.

కార్పొరేట్ సామాజిక బాధ్యత చర్యల ద్వారా ఈ ప్రాంతంలో ఆరోగ్య సంరక్షణ సదుపాయాలను బలోపేతం చేయడంలో తమ కంపెనీ (బద్ధతను ఇది ధృవీకరిస్తుందంటూ ఈ సందర్భంగా అమిత్ జైన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ చైతన్య, షణ్ముగ పొన్నుసామి సహా మాండెలెజ్ క(చెందిన పలువురు ఉన్నతాధికారులు, శ్రీసిటీ జనరల్ మేనేజర్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి కడవ

- అంతరించిపోతున్న కుండల తయారీ
- మట్టి, పెట్టుబడి లేక అనాసక్తి చూపుతున్న వృత్తిదారులు
- 'ఆదరణ'కు నోచుకోక వలసబాట పడుతున్న వైనం
- రాయితీ స్కీంలు ప్రవేశ పెట్టాలని ప్రభుత్వానికి వేడుకోలు



ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: పేదవాని ఫ్రిడ్జ్‌గా పోల్చ బడే కుండలు ఆదరణ కోల్పోయాయి. వాటిని తయా రు చేసే వృత్తిదారులు ఉపాధి అవకాశాలు లేక వలస బాట పడుతున్నారు. ఇంకొందరు కూలీ పనులకు వెళ్లి బతుకెళ్లదీస్తున్నారు. ప్రతి శుభ, అశుభ కార్యక్రమాలకు కుండలు ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే. వండే ఆహారం నుంచి దీపం వెలిగించే ప్రమిదలు, నీటి కడవలు, పాత్రలు, కంచెం, పూల కుండీలు వంటివే నాడు వినియోగించేవారు. కాల క్రమేనా మారిన జీవన విధానంలో మట్టి ద్వారా తయారైయ్యే వస్తువులకు ఆదరణ తగ్గిపోయింది.

'ఆదరణ' లేక..

గతంలో ప్రభుత్వం కుండల తయారీ వృత్తిదారులకు 5సెంట్లు స్థలం కేటాయించి, అక్కడే అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు చేపట్టింది. దీంతో వృత్తిదారులు కడవలు, మట్టి ద్వారా పలు వస్తువులను తయారు చేసి అందుబాటులోకి తెచ్చేవారు. కాలక్రమేనా ప్రభుత్వం రాయితీ పథకాలు కల్పించకపోవడం, తరం మారడం, కావలసిన మట్టిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి, కుండలు కాల్చడానికి కావల్సిన సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో వృత్తిదారులు అనాసక్తి చూపుతున్నారు. గతంలో 'ఆదరణ' పథకంలో కొంతమేరా ఆదరవు ఉండేదని తయారీదారులంటున్నారు.

ఫ్రిడ్జ్‌లు, ప్లాస్టిక్ వల్ల తగ్గిన వినియోగం

ఒకప్పుడు ప్రతిదీ మట్టిద్వారా తయారైన వస్తువులనే వాడేవారు. ప్రస్తుతం మార్కెట్‌లోకి ఫ్రిడ్జ్‌లు, ప్లాస్టిక్, స్టీల్ వస్తువులు అధికంగా రావడంతో ప్రజలు మట్టి వస్తువుల వాడకాన్ని తగ్గించేశారు. పెట్టుబడి పెట్టి తయారు చేసిన వస్తువులు కొనుగోలు కాకపోవడంతో వృత్తిదారులు అనాసక్తి చూపుతున్నారు. కొందరు ఇతర రాష్ట్రాలకు వలసలు పోగా, మరికొందరు కూలీ పనులకు వెళు తున్నారు. కడవ వ్యాపారం తెలిసిన కొందరు పక్క రాష్ట్రాల నుంచి తెచ్చి ఇక్కడ అమ్మకాలు చేపడుతున్నారు.

పట్టణాల్లో కొంత మేరా ట్రెండ్..

కోవిడ్ తరువాత మారిన జీవన విధా నంలో ప్రజలు ఆరోగ్యంపై దృష్టి సారించారు. సేం ద్రీయ వ్యవసాయ ఉత్పత్తులతో పాటు కొంతమేరా మట్టిద్వారా తయారైన గ్లాసులు, చెంబులు విని యోగిస్తున్నారు. ఆకర్షించేందుకు టీ దుకాణాల్లో తాజాగా గ్లాసులు వినియోగం కనిపిస్తోంది. కాగా అవి ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్న వ్యాపారస్తులు చెబుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలంటున్న తయారీదారులు

రాష్ట్ర ప్రభుత్వ మట్టి వస్తువుల తయారీదారులకు ప్రత్యేకంగా రాయితీ పథకంతో పాటుగా, స్థలాన్ని ఏర్పాటు చేసి ప్రోత్సాహం అందించాలని వారు కోరుతున్నారు. కను మరుగవుతున్న వృత్తికి తగిన గుర్తింపునిచ్చి సాయం అందించాలని, వలసల నివారణకు చర్యలు చేపట్టాలని ఆ వృత్తిదారులు కాంక్షిస్తున్నారు.

మట్టి వస్తువుల వాడకంతోనే ఆరోగ్యం

"మట్టి వస్తువుల వాడకంపై అవగాహన పెంచుకోవాలి. అందువల్ల ఆరోగ్యం లభిస్తుంది. మునుపటి తరం మట్టి పాత్రల్లో అన్ని ఆహార తయారీ, వాడకాలకు వినియోగించుకొనే వారు. దాదాపు 80ఏళ్లకు పైగా ఆరోగ్యంగా జీవించేవారు. ఆదరణ లేక తయారీ నిలిపేశాం. బయట ప్రాంతాల నుంచి తెచ్చి అమ్ముకుంటున్నాను. ప్రభుత్వం ఆదుకొనే చర్యలు చేపట్టాలి."

సరోజమ్మ, జీడీ నెల్లూరు

మేస్త్రీ పనులకు వెళుతున్నా..

"కుండల తయారీపై ఆసక్తి ఉంది. కావలసిన సౌకర్యాలు లేవు. ప్రభుత్వం నుంచి తోడ్పాటు లేదు. తయారుచేసి నష్టపోయే పరిస్థితి ఉంది. ప్రభుత్వం నుంచి సాయం అందితే తిరిగి మట్టి వస్తువులు తయారుచేస్తాను. కులవృత్తులను ఆదుకొనేలా ప్రభుత్వం ఆలోచన చేయాలి."

ఆముదాల గిరి, తూగుండ్రం, జీడీనెల్లూరు మండలం

'వడదెబ్బ బారిన పడకుండా
జాగ్రత్తలు తీసుకోవాలి'

ప్రజాశక్తి-సదుం: వేసవి దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎంఎల్ హెచ్‌పి జానకి అన్నారు. శుక్రవారం మండలంలోని అమ్మగారిపల్లి పంచాయతీలో వయోవృద్ధులకు, పిల్లలకు వడదెబ్బ పట్ల తగు జాగ్రత్తలు చెప్పారు. అవగాహనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సరస్వతి, అశా మానసా, అమరావతి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు రూరల్ మండలం అనంతపురం పంచాయతీ, శెట్టిన్ తంగల్‌కు చెందిన వైసీపీ నాయకుడు త్యాగరాజు నాయుడు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. త్యాగరాజు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించడానికి కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, కటారి హేమలత, ఏఎస్ మనోహర్, గీర్వాణి చంద్రప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: చిత్తూరు రూరల్ మండలం బిఎన్ఆర్ పేటలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్ మోహన్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి పలు గ్రామాల్లో పర్యటిస్తూ ఓటర్లను అభ్యర్థించారు. సైకిల్‌కి ఓటేసి ఆశీర్వదించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు

చిత్తూరులో

గంగాధరనెల్లూరులో

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో 40రోజుల ఉపవాసం అనంతరం గుడ్ ఫ్రైడే వేడుకలను అత్యంత వేడుకగా నిర్వహించుకున్నారు. చిత్తూరు నగరంలోని 150 సంవత్సరాల చరిత్ర కలిగిన వేలూరు డయాసిస్ ఆధ్వర్యంలో నిర్వహించబడే టౌన్ చర్చ్‌లో శుక్రవారం ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. సిఎస్ఐ టౌన్ చర్చిలో పాస్టర్‌లు రెవరెండ్ డాల్విన్ క్రీస్తు దాస్, రెవరెండ్ చంద్రబాబు, సుజాత విజయ్ కుమార్ శామ్యూల్ బాబు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యెహోవా సువార్తను క్రిస్టియన్ సోదర సోదరీమణులకు వివరించారు. సిలువలో ఏసుప్రభు నిర్బంధించిన సమయం నుండి మూడు గంటల వరకు క్రైస్తవులు ఆరాధన ఏసు క్రీస్తు బోధించిన ఏడు వాక్యాలను వివరించి కార్యక్రమాలు చేపట్టారు. నగర మేయర్ అముద పాల్గొన్నారు. కార్యక్రమంలో నిరూప్, నోబుల్, మంజు తదితరులు పాల్గొన్నారు.

సోమల: గుడ్ ఫ్రైడే పర్వదినం సందర్భంగా మండలంలోని క్రిస్టియన్ సోదరులు ఘనంగా పండుగను జరుపుకున్నారు. కందూరు, సోమల, నంజంపేట, మేటి మంద గ్రామాలలో గుడ్ ఫ్రైడే సందర్భంగా చర్చ్‌లలో ప్రార్థనలు చేసి పేదలకు మిఠాయిలు పంచి పెట్టారు. రంజాన్ మాసంలో వచ్చిన ప్రత్యేక శుక్రవారం సందర్భంగా ముస్లిం సోదరులు మండలంలోని అన్ని మసీదులలో ప్రత్యేక ప్రార్థనలను చేసి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

గంగాధరనెల్లూరు: మండలంలోని ప్రజలు శుక్రవారం శుభదినాన అత్యంత భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా రెవరెండ్ సురేష్ బోధకులు మాట్లాడుతూ లోకంలోని పాపులను రక్షించడానికి నాడు మన ప్రభువైన యేసుక్రీస్తు ప్రభువు ఘోర శిలువ మరణాన్ని స్వీకరించి పాపుల రక్షణ కొరకు సిలువ మరణాన్ని పొందారని ఆయన గుర్తు చేశారు. పాపికి పవిత్రమైన రక్తంతోనే పాప విమోచన అని ఆయన యేసుక్రీస్తు ప్రభువుని గుర్తు చేశారు. కార్యక్రమంలో గుణశేఖర్, రామచంద్రన్, సగాయం, రఘు బాబు, రవి, వెంకటస్వామి, జగన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై వీఆర్వోలకు శిక్షణ

ప్రజాశక్తి-రామకుప్పం: మండల తహశీల్దార్ శ్రీధర్ ఆధ్వర్యంలో విఆర్వోలకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలన్నారు. రాజకీయ పార్టీలను ఎప్పటికప్పుడు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించాలన్నారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు ముందస్తుగా తీసుకోవాలన్నారు. సమస్యాత్మకంగా ఉన్న కేంద్రాలను గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ దిలీప్, వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

బీసీల అభివృద్ధికి కృషి చేస్తాం: ప్రసాద్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: బీసీల అభివృద్ధికి కృషి చేస్తామని టీడీపీ చిత్తూరు ఎంపి అభ్యర్థి దుగ్గిరాల ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని కిరమంద, చికూరుపల్లి, పెరుమాళ్‌పల్లిలో బీసీల ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి కలికిరి మురళీమోహన్, నాయకులు జయప్రకాష్, సీఆర్ రాజన్, మురళి, ప్రకాష్‌నాయుడు, మహేంద్ర గౌడు, నాగరాజు గౌడు, శ్రీనివాసులు పలువురు నాయకులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-పుంగనూరు: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది పుంగనూరు మార్కెట్ యార్డ్ ఆవరణంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కొత్తపేట సర్కిల్‌కు చెందిన బాలగంగాధర్ తిలక్ (56) హోటల్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి లిఖిత, వినీత ఇద్దరు కుమార్తెలు ఉండగా ఇద్దరికీ పెళ్లిళ్లు చేశారు. ఇద్దరు అల్లుళ్ళు ఒకరు సాఫ్ట్వేర్ ఇంజనీరు, మరొకరు బిల్డర్‌గా ఉన్నారు. ఇంటిలో గొడవపడి మనస్థాపానికి గురై గురువారం రాత్రి సమీపంలో ఉన్న మార్కెట్ యార్డ్ ఆవరణంలోకి వెళ్లి తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు.

విద్యుత్ షాక్‌తో మహిళా రైతు మృతి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: మండలంలోని 197 రామాపురం పంచాయతీ సింగారపేటలో గురువారం విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి చెందారు. సింగారపేటకు చెందిన లాజర్ భార్య షాలిని(46) తమ పొలంలో మోటారు స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఆమెను వేలూరు సీఎంసీకి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు

ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. చిత్తూరు నియోజకవర్గ పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ నివాసాలపై తెలుగుదేశం జెండాలను ఎగురవేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు సిఆర్ రాజన్, నియోజవర్గ అభ్యర్థి గురజాల జగన్మోహన్, పార్లమెంటరీ అభ్యర్థి ప్రసాదరావు, మాజీ ఎంఎల్‌సి దొరబాబు, మాజి మేయర్ కఠారి హేమలత నాయకులు చంద్రప్రకాష్, కోదండయాదవ్, సురేంద్రకుమార్, మోహన్‌రాజ్‌లు తెలుగుదేశం పార్టీని ఎగురవేశారు. పార్టీ వ్యవస్థాపకులు ఎన్‌టీఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు.

ఎస్ఆర్ పురం: మండల కేంద్రమైన పుల్లూరు క్రాస్‌లో టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో 42వ పార్టీ ఆవిర్భవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ వ్యవస్థాపకులు ఎన్‌టీఆర్‌ని స్మరించుకొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు.

రామకుప్పం: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ కార్యాలయంలో టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు, నేతలు ఘనంగా జరుపుకున్నారు. దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ స్థాపించారన్నారు. నిరుపేదలకు రెండు రూపాయలకే కిలో బియ్యం అందించి ఆకలి తీర్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆయన మార్గదర్శకాలతో చంద్రబాబు నాయుడు కూడా వివిధ పథకాలు ప్రవేశపెట్టి పేదరిక నిర్మూలనకు శ్రీకారం చుట్టాలన్నారు. కార్యక్రమంలో ఆనంద రెడ్డి, మునస్వామి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు, సీతాపతి, శ్రీరాముల రెడ్డి, నారాయణ చారి, విజయ్రెడ్డి, సుబ్రి, బాలు, రఫీ పాల్గొన్నారు.

పలమనేరు: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలువురు కార్యకర్తలు, నాయకులు, నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్రహ్మయ్య, వెంకటరమణ రెడ్డి, ఆర్.బి.సి. కుట్టి, గిరిబాబు, నాగరాజు, సుబ్రహ్మణ్యం గౌడ్, ఖాజా, క్రిష్ణ మూర్తి గౌడ్, బిఆర్సీ కుమార్, మాబాషా, సోమశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో ఎన్‌టీఆర్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

రూ.లక్ష నగదు సీజ్

ప్రజాశక్తి-సోమల: సోమల సమీపంలోని అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పోలీసులు, ఎఫ్ఎస్ బృందం కలసి వాహనాల తనిఖీ చేపట్టారు. పీలేరు హరినాథపురం గ్రామానికి చెందిన గౌస్ పీర్ అనే అతను బొలెరో మ్యాక్స్ ట్రక్ వాహనంలో రూ.లక్ష 6వేల నగదును తరలిస్తుండగా గుర్తించారు. నగదుకు సంబంధించిన రికార్డులు, బిల్లులు లేకపోవడంతో ఎంసిసి రూల్స్ ప్రకారం సీజ్ చేసి ఐటీ శాఖ వారికి జమ చేయడం జరిగిందని ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు.

వైసీపీలో చేరిక



వైసీపీలో చేరుతున్న నాయకులు

ప్రజాశక్తి-రామకుప్పం: మండల కేంద్రానికి చెందిన శివాజీ నగర్ కాలనీకి చెందిన టిడిపి కార్యకర్తలు ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైసీపీలో చేరారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి స్వాగతించారు. కార్యక్రమంలో బాబు రెడ్డి, చంద్ర రెడ్డి, అప్పి, సిద్ధప్ప, చెంగారెడ్డి, యశ్వంత్ రెడ్డి పాల్గొన్నారు.

ఆ యువకుడిది ఆత్మహత్య కాదు.. హత్యే

- కుటుంబీకులు, బంధువుల ఆరోపణ
- అంత్యక్రియలు జరపకుండా వింజం రోడ్డు వద్ద ఆందోళన
- పోలీసులు జోక్యంతో రెండు రోజుల తరువాత అంత్యక్రియలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: వింజం దళిత వాడలో యువకుడుది ఆత్మహత్య కాదు హత్యేనని వారి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. మండలంలోని వింజం దళితవాడకు చెందిన కుప్పయ్య కుమారుడు ధనుష్ (19), దళవాయిపల్లె దళిత వాడలోని అమ్మాయి ప్రేమలో పడ్డారు. ఏం జరిగిందో ఏమో కానీ వింజం దళితవాడకు సమీపంలోని ఓ చెట్టుకు బుధవారం సాయంత్రం ఉరేసుకుని మరణించిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ సమాచారంతో సిఐ శంకర్ సంఘటన స్థలానికి వెళ్ళి యువకుడు శవాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, గురువారం పోస్ట్ మార్టం పూర్తి చేసి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. యువకుడు ధనుష్ ఆత్మహత్య చేసుకోలేదని, అమ్మాయి తరపున బంధువులే హత్య చేసి చెట్టుకు వేలాడేసి వెళ్ళిపోయారనీ ఆరోపించారు. కాగా గురువారం సాయంత్రం నుండి రాత్రి వరకు మృతుడి కుటుంబ, బంధువులు నిరసన వ్యక్తం చేస్తుండగా, సీఐలు శంకర్, విశ్వనాధరెడ్డిలు వారితో చర్చలు జరిపి యువకుడు శవానికి అంత్యక్రియలు నిర్వహించాలని కోరగా, అందుకు వారు అంగీకరించలేదు. యువకుడు హత్యకు కారణమైన వారిని అరెస్టు చేస్తేనే పట్టు బట్టారు. సీఐలు ఎంత చెప్పినా యువకుడు శవాన్ని అంత్యక్రియలు చేయడానికి ఒప్పుకోలేదు. ఈ విషయంగా శుక్రవారం మళ్లీ రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. అయితే మృతుడు కుటుంబం సభ్యులు, బంధువులు, పోలీసులు చెప్పిన విషయాలకు ఒప్పుకోక ధనుష్ మృతి కేసును అమ్మాయి తరపున వారిపై హత్య కేసుగా మార్చాలని పోలీసులును డిమాండ్ చేశారు. అందుకు పోస్ట్ మార్టం నివేదిక, పోలీస్ విచారణ మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పాగా, అందుకు మృతుడు బంధువులు అంగీకరించి ధర్నా విరమించారు. అనంతరం ధనుష్ మృతదేహానికి పోలీసులు బందోబస్తు నడుమ ధనుష్ అంత్యక్రియలు నిర్వహించారు. అమ్మాయి తరపున చెందినవారు కిరణ్, అమాసయ్య, రవి, మదన్‌లపై కేసు నమోదు చేసినట్లు సిఐ శంకర్ వివరించారు. శుక్రవారం గంగాధర నెల్లూరు సీఐ శంకర్ సమాచారమిచ్చి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మరో ముగ్గురు సీఐలు విశ్వనాథరెడ్డి, రవిశంకర్ రెడ్డి, కుళ్ళయప్ప, ఎస్ఐలు రామాంజనేయులు, నాగ సౌజన్య, వెంకటసుబ్బమ్మ, కరీ మున్నీసాలతో పాటు 20మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వింజం దళితవాడ బస్టాప్ వద్ద మృతుడు ధనుష్ బంధువులు ధర్నా

ప్రభుత్వ ఆస్పత్రికి దారేది?

- నిబంధనలు విస్మరించి వాహనాల పార్కింగ్
- దారి లేక అత్యవసర వాహనాలకు అవస్థలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు వైద్య విధాన పరిషత్ ఆస్పత్రికి దారి లేక అత్యవసర వాహనాల ప్రవేశానికి గంటలు తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. నిబంధనలు విస్మరించి ద్విచక్ర వాహనదారులు ఆస్పత్రి ప్రధాన ప్రవేశ గేటుకు అడ్డంగా నిలబెడుతుండడంతో మనుషులు సైతం ఆస్పత్రి లోనికి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మెయిన్ గేటు వద్ద పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాలలో ఉన్న వారు, ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న వారు ద్విచక్ర వాహనాలను ప్రభుత్వ ఆస్పత్రికి వద్ద నిలిపి వెళ్లిపోతున్నారు. ఏదైనా ప్రమాదాలకు గురై 108 వాహనాల్లో అత్యవసరంగా ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకొచ్చిన వాళ్లు వెళ్లేందుకు దారి లేక పడరాని పాట్లు పడుతున్నారు. ఈ కారణంగా నిత్యం రోగులకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ డాక్టర్లు వాహనాలు లోపల ఉంచకూడదని పలుసార్లు వాహన దారులకు హితవు చెప్పినా లోపలే వాహనాలు పార్కింగ్ చేసి వెళుతుండడంతో ఇబ్బందికరంగా ఉందని వైద్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేసినా వాహనదారులు ఘర్షణ పడి వాహనాలను పార్కింగ్ చేసి ఆవరోధం కలిగిస్తున్నారని వైద్యులు, రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా వాహనాలు పార్కింగ్ లేకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. లేకుంటే ఆందోళన చేపడుతామని స్థానికులు హెచ్చరించారు.

వాహనాల పార్కింగ్ చేయడంతో దారి కరువైన ప్రభుత్వ ఆస్పత్రి

9మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యబాబు

- రూ.5లక్షల 26వేలు స్వాధీనం
- 11 సెల్ఫోన్లు, ఏఫ్ జెడ్ వాహనం సీజ్
- పట్టుబడిన వారిలో ఐడీ పార్టీ కానిస్టేబుల్ పూర్ణచంద్రరావు
- ఇద్దరు పరారీ

ప్రజాశక్తి-వెదురుకుప్పం/కార్వేటినగరం: తొమ్మిది మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5లక్షల 26వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సత్యబాబు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులకు వివరాలను వెల్లడించారు. మండలంలోని కొల్లాగుంట పంచాయతీ బట్టువారిపల్లి సమీపంలోని మామిడి తోటలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్.ఐ వెంకటక్రిష్ణ తమ సిబ్బందితో దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 11మందిని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించడంతో గ్యాంబ్లింగ్ ఆడిస్తున్న పళ్లిపట్టు గ్రామానికి చెందిన సైమన్, అతనితో పాటు మరో వ్యక్తి పరారీ అయ్యాడని, మిగిలిన 9 మందిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి రూ.5లక్షల 26 వేలను స్వాధీనం చేసుకోవడమే కాకుండా 11సెల్ఫోన్లు, ఎఫ్‌జెడ్ ద్విచక్రవాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఇందులో తిరుపతి పట్టణం ముత్యాలరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్లో ఐడీ పార్టీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న పూర్ణచంద్రరావు పేకాటలో పట్టుబడినట్లు తెలిపారు. వీరిలో ఎస్‌కే రాజారావు, పాండ్యన్స్, మోహన్, గుణశేఖర్, దిలీప్, గణేషన్, సురేష్, రవిశంకర్లు ఉన్నారు. వీరిలో ముగ్గురు ఆంధ్రాకు చెందిన వారు. మిగిలిన వారు తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారుగా చెప్పారు. గ్యాంలింగ్ ఆడిస్తున్న సైమన్ కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు. నిందితులపై కేసునమోదు చేసినట్లు మీడియాకు వెల్లడించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ పవన్‌కుమార్, ఎస్ఐ వెంకటకృష్ణ, ఏఎస్ఐ మునికృష్ణ, సిబ్బంది రాజశేఖర్, మురళీకృష్ణంరాజు, కుబేరన్, మోహన్ పలువురు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపడమే ధ్యేయం

కేశవరెడ్డి విద్యా సంస్థల అధినేత

విద్యాసంస్థల అధినేత కేశవరెడ్డి పేర్కొన్నారు. రేణిగుంట మండలంలోని కుక్కల దొడ్డిలోని కేశవరెడ్డి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో విద్యార్థులు నృత్యాలు, పాటల కార్యక్రమాలతో అలరించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఆటలు ఆడించారు. విద్యార్థులు నాటికలు, ఏక పాత్రలు ప్రదర్శించారు. విద్యార్థులు ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని ఉన్నత పాఠశాలకు మార్పు చెందుతున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి విద్యాసంస్థల ఫౌండర్, ఛైర్మన్ కేశవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు చదువు పట్ల ఆసక్తి కలిగించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థి వికాసానికి ఆట పాటల ద్వారా నూతన పద్ధతులతో విద్యను అందిస్తే వారు విద్య పట్ల ఆసక్తి కనబరుస్తారన్నారు. ఈ పోటీ ప్రపంచంలో విద్యార్థి తన స్థానాన్ని పదిలపరుచుకోవాలంటే నిరంతర పరిశీలన శక్తి ఎంతో అవసరమని వారు వివరించారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థినులు

చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీ నిఘా ఉండాలి

పోలీసులకు డిఎస్‌పి ఆదేశం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: చెక్ పోస్టుల వద్ద నిఘా పకడ్బందీగా నిర్వహిం చాలని డిఎస్‌పి ఉమామహేశ్వర్ రెడ్డి పోలీసులను ఆదేశించారు. బుచ్చినాయుడు కండ్రిక పోలీస్ స్టేషన్‌ను ఎస్ఐ వెంకట నరసింహం ఆధ్వర్యంలో డిఎస్‌పి ఉమా మహేశ్వర్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ కేసులు వివరాలను స్టేషన్ సిబ్బంది కొరత, వివిధ రకాల విషయాలను క్షుణ్ణంగా అడిగి తెలుసు కున్నారు. 'పోలీస్ స్టేషన్లో పాత కేసులు ఎన్ని కేసులు నమోదు చేశారు? ఎన్ని కేసులు పెండింగ్‌లో వున్నాయి?' అని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎన్నికలకు పోలీసు సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎదుర్కోవాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉంచి ఎవరైనా మద్యాన్ని నగదు అనుమ తులు లేకుండా తరలిస్తుంటే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవా లని ఆదేశించా రు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి ఒక్కరిని గౌరవం గా విచారించి వారి సమస్యను వెంటనే పరిష్క రించాలని సిఐ శ్రీహరిని,ఎస్ఐవెంకట నరసింహులును ఆదేశించారు. రాబోయే ఎన్నికల సందర్భంగా తనిఖీలు పకడ్బం దీగా నిర్వహించాలన్నారు. మద్యం, నగదును ఎవరైనా తరలిస్తుంటే వారిని వెంటనే అదుపులోకి తీసు కొని విచారణ జరిపి కేసు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరుశురాంను పరామర్శించిన భరత్ రెడ్డి

ప్రజాశక్తి- తొట్టంబేడు: మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతూ తిరుపతి రష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తొట్టంబేడు మండలం కొండ్రాజుపల్లెకు చెందిన పరుశురాం, వెంకట్రామయ్యను జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు. పరుశురాం, వెంకట్రామయ్య త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. కలవగుంట భరత్ రెడ్డి వారికి తనవంతు ఆర్థికసాయం చేశారు. పండ్లు, బ్రెడ్ అందించారు. ఈ కార్యక్రమంలో మహేష్ నాయుడు, హరినాయుడు, పాండు, వెంకటేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

సొంత గూటికి మస్తాన్ యాదవ్

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : పట్టణంలో నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి బంగ్లాలో డాక్టర్ మస్తాన్ యాదవ్ శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. టిడిపిని వదిలి వైసీపీ గూటికి చేరుకున్న డాక్టర్ మస్తాన్ యాదవ్ విలేకరుల సమావేశంలో పలు ఆశ్చర్యకరమైన విషయాలను వెల్లడించారు. ఇంతకాలం దాగి ఉన్న మనసులో భావాలు పంచుకున్నారు. బీసీలకు టిడిపిలో కష్టపడినా ఫలితం లేదని తెలుసుకుని 'మానమ్మకం నువ్వే జగనన్న' అంటూ గతంలో పాదయాత్రలో ఆయనకు సేవ చేసిన సమయంలో చూపిన ఆప్యాయతను నమ్మకాన్ని గుర్తుతెచ్చుకొని వైసీపీలో చేరానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి రామ్ కుమార్ రెడ్డి, తిరుపతి పార్లమెంటు అభ్యర్థి గురుమూర్తి, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీల్ చైర్ పై పులివర్తి సుధా రెడ్డి ప్రచారం

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) గెలుపు కోసం సతీమణి పులివర్తి సుధా రెడ్డి చంద్రగిరి మండలంలోని ఎ.రంగంపేట గ్రామంలో వీల్ చైర్ లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాలుకు గాయమైనా లెక్క చేయకుండా ఆమె టిడిపి ఉమ్మడి మేనిఫెస్టో లోని పథకాలను ప్రజలకు వివరిస్తూ సమస్యలు తెలుసుకుని, భరోసా కల్పిస్తూ టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని విజయానికి కృషి చేయాలన్నారు. పులివర్తి సుధా రెడ్డి వీల్ చైర్ పై కూర్చుని ఇంటింటి ప్రచారం చేస్తున్న తీరు ప్రజలను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు భూపతి, దేవిలాల్, సుబ్రహ్మణ్యం యాదవ్, వేణు రాయల్, పచ్చిపాల వెంకటరమణ, భూలక్ష్మి, వేణుగోపాల్ రెడ్డి, పలని,వాసు రాయల్, చంగల్ రాయల్ ఆచారి, జ్ఞాన శేఖర్ పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: ఎన్నికల నేపథ్యంలో ప్రజలు నిర్భయంగా స్వేచ్ఛా వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఓటర్లకు భరోసా కల్పిస్తూ బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో ఎస్ఐ వెంకట నరసింహ ఆధ్వర్యంలో 30 మంది కేంద్ర బలగాలతో శుక్రవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా నగదు తరలింపులను అరికట్టేందుకు, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిం చేందుకు కేంద్ర బలగాలు మండలంలో మోహరించాయని తెలిపారు. ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే కఠిన శిక్షలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

రామచంద్రాపురం: సార్వత్రిక ఎన్నికలు-2024 నేపథ్యంలో చంద్రగిరి సబ్ డివిజన్, తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ తమీం అహ్మద్ ఆధ్వర్యంలో పేరూరు పంచాయతీ లో హరిపురం కాలనీ, జనార్ధన్ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, పేరూరు ప్రాంతాల పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లను చైతన్యవంతుల్ని చేసేందుకు కేంద్ర సాయుధ బలగాలతో కవాతు (ఫ్లాగ్ మార్చ్) ను శుక్రవారం నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా, ప్రజల్లో ఉన్న భయాందోళనను పోగొట్టి, ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతవరణం కల్పించడమే ధ్యేయంగా పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ ఎస్ఐ లు నాగేంద్రబాబు, వెంకటరమణ, పోలీస్ స్టేషన్ సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

వైసిపి నుండి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని, నెన్నూరు పంచాయతీ నెన్నూరు గ్రామానికి చెందిన వైసిపి సానుభూతిపరుడు ఐ శివ నారాయణ రెడ్డి వైసీపీని వీడి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో టిడిపిలో శుక్రవారం చేరారు. పార్టీలో చేరిన వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని పులివర్తి నాని మాట ఇచ్చారు. పులివర్తి నాని పోరాట పటిమకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు, పులివర్తి నాని విజయానికి కృషి చేస్తానని శివ నారాయణ తెలిపారు.